# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



సమైక్య పాలనలో భూ రికార్డుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. భూమి అనుభవదారు ఒకరుంటే, రికార్డుల్లో పట్టాదారు మరొకరు, కబ్జాదారు ఇంకొకరు ఉండేవారు. వీఆర్ఓ మారిండంటే కబ్జా కాలంలో పేర్ల మార్పులు, పాస్ పుస్తకాల్లో భూమి హెచ్చుతగ్గులు ఉండేవి. ఫలితంగా నిత్యం పోలీస్‌స్టేషన్లలో కేసులు, కోర్టుల్లో దావాలు వేసే పరిస్థితి. అలాంటి పరిస్థితిని స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా తాసీల్దార్‌కు రెవెన్యూ అధికారాలు అప్పగించి పది నిమిషాల్లోనే భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్‌తో నేడు భూ సమస్యలన్నీ పరిష్కారమవడమే కాకుండా లెక్కలన్నీ రికార్డుల్లో భద్రంగా ఉన్నాయి. అలాంటి ధరణిని తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పాత పద్ధతులతో భూ పంచాయతీలు పెరుగుతాయని, దళారీ వ్యవస్థ వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరణి కొనసాగేందుకు సీఎం కేసీఆర్‌కు అండగా ఉంటామని తేల్చి చెబుతున్నారు.

# ధరణి పోతే దళారీలదే పెత్తనం

## కాంగ్రెస్ నేతలపై రైతన్న కన్నెర్ర

### ధరణి రద్దు చేస్తే మళ్లీ దళారులు వస్తారు

ధరణి వచ్చిన తరువాత రైతులకు ఎలాంటి బాధలు లేవు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే భూమిని పాసు పుస్తకాల్లో ఎక్కిస్తున్నారు. వేలి ముద్ర వేస్తే తప్ప భూ రికార్డులు మారవు. ఒక్క రోజులోనే భూమి రిజిస్ట్రేషన్ చేస్తూ రైతులకు దన్నుగా నిలిచిన ధరణిని రద్దు చేస్తే మళ్లీ దళారులు వస్తారు. భూమి రిజిస్ట్రేషన్లలో అవకతవకలు జరుగుతాయి. చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ధరణి పోర్టల్‌ను తీసేస్తామని వ్యవసాయంపై అనుభవం లేని రేవంత్‌రెడ్డి చెప్పడం సిగ్గుగా ఉంది. భూ రికార్డుల్లో పూర్వ వివరాలను పెట్టి ధరణి రద్దు చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాలి. రైతులంతా ఆలోచించి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను గెలిపించుకుందాం.

– వేల్పుల కొమరమల్లు, రైతు, ఏపూరు, ఆత్మకూర్.ఎస్ మండలం



### ధరణితో మస్తు సౌలతయ్యింది

గతంలో భూముల వివరాలు సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. అవసరాల కోసం భూములు అమ్మాలన్నా, కొనాలన్నా తహసీల్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. పైసలు ఇస్తేగానీ పని కాకపోయేది. సీఎం కేసీఆర్ భూముల రికార్డులను సరిచేసి ధరణి పోర్టల్‌లో నమోదు చేయించారు. దీంతో ఇప్పుడు భూములు అమ్మాలన్నా, కొనాలన్నా ఎలాంటి ఇబ్బందులు లేవు. మీ సేవలో స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత తహసీల్ కార్యాలయంలో 20 నిమిషాల్లో పని అయిపోతుంది. ధరణి మంచి సౌలత్‌గా ఉన్నది.



– కుందెన శ్రీశైలం, మాచనపల్లి, నూతనకల్

### ధరణి పోతే రైతు బతుకు ఆగమే..



సీఎం కేసీఆర్ ధరణి తెచ్చిన తర్వాతనే భూముల విషయంలో రైతులకు అన్ని విధాలుగా లాభం చేకూరింది. గతంలో వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలో అనేక ఇబ్బందులు పడ్డాం. ఏడాదికోసారి భూ రికార్డుల మార్పులు, చేర్పులు చేసేవారు. పట్వారీ వ్యవస్థ చేస్తున్న తప్పిదానికి రైతులు బలవుతున్నారనే కేసీఆర్ సార్ ధరణిని తీసుకొచ్చారు. ధరణి వచ్చిన తర్వాత మా భూములకు ఎంతో భద్రత ఉంది. రైతుల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారు. ధరణి పోతే రైతుల బతుకులు ఆగమవుతాయి. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వాళ్లు దాన్ని తీసేస్తామంటే ఊరుకుంటామా? ఓటుతో బుద్ధి చెప్పి తీరుతాం. ఈసారి కూడా బీఆర్ఎస్‌ను గెలిపిస్తాం.

– సింగం దుర్గయ్య, పెంచికల్‌దిన్నె, నేరేడుచర్ల మండలం



### ధరణి తీసేస్తే దళారీ వ్యవస్థ వస్తది

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తామంటున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి తేకముందు ఒక రైతు భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ముందుగా రెవెన్యూ కార్యదర్శి చేయి నోట్లతో తడపాల్సి వచ్చేది. పైసలు తీసుకున్నా పని తొందరగా అయ్యేది కాదు. ఒకవేళ ఆయన దయతలిచి రిజిస్ట్రేషన్ చేస్తే మళ్లా ఇంకోరోజు మ్యుటేషన్ చేయడానికి పిలిచి పెద్ద సార్లకు పైసలు ముట్టలేదు. నువ్వు ఇంతకు ముందు ఇచ్చినవి ఖర్చులకే సరిపోయాయని ఇంకా డబ్బులు గుంజేటోళ్లు. ఇప్పుడు ధరణి వచ్చాక రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే మరుసటి రోజు తాసీల్దార్ కార్యాలయంలో టైమ్ ఇస్తారు. సమయానికి పోతే రైతు వేలిముద్ర ద్వారా రిజిస్ట్రేషన్ చేసి వెంటనే మ్యుటేషన్ కూడా చేసి ఆన్‌లైన్ పట్టా కాగితాలు చేతిలో పెడుతున్నారు. ఈ పని మొత్తానికి ఆన్‌లైన్ చార్జీలు చెల్లిస్తే సరిపోతుంది. గతంలో కొన్ని రోజుల పాటు జరిగే పనులు ధరణి పుణ్యాన ఒక గంటలోనే పూర్తవుతున్నాయి. ఇంత మంచి సౌలత్‌ను కాంగ్రెస్ తీసేస్తామంటున్నది. ప్రజలు గమనించి మనకు మంచి చేస్తున్న ప్రభుత్వం ఏదో.. మనల్ని దోచుకుంటున్నది ఎవరో గమనించాలి. మన విలువైన ఓటు ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదిద్దాం.

– గోల్కొండ రవి, రైతు, కుంటపల్లి, మద్దిరాల మండలం



### ధరణి లేకపోతే రైతులకు తిప్పలే

బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతులు భూముల రిజిస్ట్రేషన్ సమయంలో ఎదుర్కొంటున్న తిప్పలు తప్పాయి. ఎక్కడికో వెళ్లి పాట్లు పడకుండా తాసీల్దార్ కార్యాలయంలో ఒక్క రోజులోనే రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. ధరణిలో చేతి రాతలతో చేసే పొరపాట్లకు తావులేదు. రైతుల భూమి వివరాలు పక్కాగా ఉంటున్నాయి. ఒక రైతు తన భూమిని మరొకరికి బదిలీ చేయాలంటే తన వేలిముద్ర పెడితేనే మార్పిడి జరుగేటట్టు పకడ్బందీ చేశారు. అలాంటి ధరణి విధానాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తీసేస్తామంటున్నది. అంటే రైతులు మళ్లీ పాత విధానంలోనే కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఆయనకింత, ఈయనకింత డబ్బులు ముట్టజెప్పే దళారీ వ్యవస్థను తీసుకురావడానికి చూస్తున్నది. దళారీలు రైతులను అరిగోస పెడుతారు. రైతులను గోస పెట్టే ప్రభుత్వం మాకొద్దు. మంచి చేసే సర్కారును గెలిపించుకుంటాం.


– గుజ్జ సంజీవరావు, చిన నెమిల, మద్దిరాల మండలం



### 3గంటల కరెంటుతో రైతులు అప్పుల పాలయ్యేదే..

కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పినట్లు వ్యవసాయానికి 3గంటల కరెంటు ఇస్తే రైతులు మళ్లీ అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కష్టాలు ఎన్నో చూశాం. కరెంటు ఏ సమయానికి వస్తదో తెలియక నానా ఇబ్బందులు పడేవాళ్లం. రాత్రి పూట బావుల కాడికి పోయి పాములు, తేళ్ల కాటుకు, కరెంటు షాక్ కొట్టి రైతులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. మళ్లీ కాంగ్రెస్ సర్కారు వస్తే రైతులు వ్యవసాయాన్ని వదిలేసి వలసలు పోతారు. ఇప్పుడున్న కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి 24గంటల కరెంటు ఇస్తున్నది. మాకు 24 గంటల కరెంటు ఇచ్చే ముఖ్యమంత్రి కావాలి.

– తడకమళ్ల శ్రీరంగం, సోలిపేట (సూర్యాపేట రూరల్)



# మూడు గంటలనోళ్లకి మాడు పగులగొడుతం

## హస్తం పార్టీ నేతలపై అన్నదాత మండిపాటు

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు ఇస్తుంటే కాంగ్రెస్ తట్టుకోలేకపోతున్నది. రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తూ ఆనందంగా ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. సాగుకు 3 గంటల కరెంట్ చాలని, రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడాలని ఉచిత సలహాలు ఇస్తున్నది. కాంగ్రెస్ అర్థం లేని మాటలపై రైతులు మండిపడుతున్నారు. మూడు గంటలనోళ్ల మాడు పగులగొడుతామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతను ఆగం చేయడమే లక్ష్యంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల్లో షాక్ ఇస్తామని హెచ్చరిస్తున్నారు.

### 10హెచ్‌పీ మోటర్లు పెద్ద భారం



కాంగ్రెసోళ్లు ఏ ఊరికి వెళ్లినా మూడు గంటల కరెంట్ ఇస్తామని, 10 హెచ్‌పీ మోటర్లు వాడితే సరిపోతదని చెబుతున్నరు. మూడు గంటల కరెంట్ ఇస్తే మూడు గుంటల భూమి కూడా పారదు. అది కూడా ఎప్పుడిస్తరో తెల్వదు. మా వద్ద ఉన్న 5 హెచ్‌పీ మోటర్లను తీసేసి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలట. అవి పెట్టాలంటే ఎక్కువ ఖర్చు వస్తది. అంత భారం మా లాంటి పేద రైతులం మోయలేం. పైగా ఇచ్చిన మూడు గంటల్లోనే రైతులంతా ఒకేసారి మోటర్లు ఆన్ చేస్తే ట్రాన్స్‌ఫారాలు పేలిపోతాయి. మా బతుకులు ఆగం చేయాలని కాంగ్రెస్ పార్టీ చూస్తున్నది. మూడు గంటల కరెంటు చాలంటున్న ఆ పార్టీకి ఓటేస్తే రైతులకు చేటు అవుతది. మాకు 24 గంటల కరెంటు కావాలి.

– పాపానాయక్, దిర్శనపల్లి, నూతనకల్ మండలం



### 3గంటల కరెంట్ ఇస్తే వ్యవసాయం బంద్ చేసుకోవాల్సిందే



గత ప్రభుత్వాల హయాంలో కరెంట్‌తో ఎన్నో తిప్పలు పడ్డాం. మోటర్ల దగ్గర రాత్రి, పగలు కాపలా కాస్తూ నీళ్లు పెట్టినం. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినాక 24 గంటల కరెంట్‌తో రంది లేకుండా పంటలు పండిస్తున్నాం. తొమ్మిదేండ్ల నుంచి రైతులంతా సంతోషంగా ఉన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు మూడు గంటల కరెంటు చాలంటున్నారు. మూడు గంటల కరెంట్‌తో ఒక్క మూల కూడా తడవదు. వ్యవసాయం బంద్ చేసుకోవాల్సి వస్తది. మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెసోళ్లు మాకొద్దు. 24గంటల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్‌కు మద్దతిస్తాం.

– బత్తుల గురువయ్య, చిల్పకుంట్ల, నూతనకల్ మండలం

### 3 గంటల కరెంటుతో పొలాలు ఎట్ల పారుతయి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 3 నుంచి 5గంటల కరెంటు ఇస్తమని ఆ పార్టీ నాయకులు అంటున్నరు. మూడు గంటల కరెంట్ ఇస్తే పొలాలు ఎట్ల పారుతయి. కాంగ్రెస్ పెద్ద నాయకులకు వ్యవసాయం మీద అవగాహన లేకున్నట్లుంది. ఒకడేమో 3 గంటలు చాలంటడు, మరొకడు 5 గంటల సరిపోతదంటడు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టమంటరు. వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్లు వాడడం నా జీవితంలో చూడలేదు. గత కాంగ్రెస్ హయాంలో కరెంటు ఇబ్బందులతో చాలా మంది రైతులు పాము, తేలు కాట్లతో, కరెంట్ షాక్‌తో చనిపోయారు. నాడు పొలాలు పారియ్యడం కష్టంగా ఉండేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. ఎప్పుడు అవసరం వస్తే అప్పుడు మోటర్లు ఆన్ చేసుకొని పొలాలు పారించుకుంటున్నం. రాత్రి పూట పొలాల దగ్గరకు పోయే బాధ తప్పింది. కేసీఆర్ సార్ 24 గంటల విద్యుత్ ఇవ్వడం వల్ల సాగర్‌లో నీళ్లు లేకున్నా అంతో ఇంతో పండించుకున్నం. మళ్లీ కాంగ్రెస్ వాళ్లు వస్తే రైతులకు పాత తిప్పలు వస్తయి. కోరి కష్టాలు తెచ్చుకోవద్దు. రైతులు, రైతు కుటుంబాలు ఆలోచన చేసుకోవాలి. కరెంటు కష్టాలు తీర్చిన దేవుడు సీఎం కేసీఆర్.



– రాగిరెడ్డి లక్ష్మారెడ్డి, యల్లాపురం, పాలకవీడు మండలం

### రైతుల కష్టాలు కాంగ్రెసోళ్లకేం తెలుసు



సూర్యాపేట జిల్లా ఇప్పుడు 24 గంటల ఉచిత కరెంటుతో బంగారం లాంటి పంటలు పండిస్తున్నం. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్‌రెడ్డికి వ్యవసాయం మీద కనీస అవగాహన లేదు. చిన్న, సన్నకారు రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడరనే విషయాన్ని గుర్తించాలి. ఎన్నికల్లో లబ్ధి కోసమే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నరు. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంటు ఉచితంగా ఇస్తుంటే.. కాంగ్రెస్ వాళ్లు ఓట్ల కోసం ఇలా రైతులతో రాజకీయం చేస్తున్నరు. వ్యవసాయం మీద అవగాహన లేని కాంగ్రెస్ నాయకులకు రైతుల పని, వారి అవసరాలు ఏం తెలుసు? చాతకాని మాటలు చెప్తే ఎవరూ నమ్మరు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి అండగా ఉంటాం.

– తాళ్లపల్లి సైదులు, కల్లూరు, నేరేడుచర్ల మండలం,

### నాటకాలు కావు.. నాణ్యమైన కరెంట్ కావాలె

కరెంట్ విషయంలో కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు చెబుతూ నాటకాలు ఆడుతూ ఎట్లనైనా అధికారంలోకి రావాలని చూస్తున్నది. కానీ.. రైతులకు కావాల్సింది నాటకాలు కావు.. నాణ్యమైన కరెంట్. మూడు గంటల పాటు కరెంట్ ఇస్తామంటే ఎట్ల? మూడు గంటలతో అసలు ఒక మూలైనా తడుస్తదా. ఎవుసం చేసేటోడికైతే ఎరుకైతయ్ రైతుల బాధలు. యాడనో కూసోని మాట్లాడేటోనికి ఎట్ల తెలుస్తయ్. అయినా కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడుడేంది. ఒకసారి పొలాల కాడికి వచ్చి రైతులు ఎన్ని బాధలు పడుతున్నరో చూడాలె. అప్పుడైతే ఎవుసంలో ఎన్ని శెరలు ఉంటయనేది తెలుస్తది. అసలు పొలాలు పండించేటోడు ఎవడైనా బోర్లు, బావులకు 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలని చెప్తడా. మూడు, నాలుగు గంటల్లో బోర్లు, బావుల్లో నీళ్లు అడుగంటి మోటర్లు బంద్ చేయాల్సి వస్తది. ఇలా అయితే రైతు మోటర్ బంద్ చేయడానికి, వేయడానికే సరిపోతది. మిగతా పనులు ఎవడు జెయ్యాలే. రైతులంతా 10 హెచ్‌పీ మోటర్లు పెడ్తే ఇప్పుడున్న ట్రాన్స్‌ఫారాలు కాలిపోతయ్. స్టార్టర్లు, పైపులైన్లు కూడా పనికి రావు. ఇవన్నీ మార్చేసరికి రైతులకు తడిసి ముప్పందువు అయితయ్. ఈ ఖర్చుంతా ఎవరు భరించాలె. ఇప్పుడు 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్ ఇస్తుండడంతో ఏ బాదరా బందీ లేకుండా వ్యవసాయం చేసుకుంటున్నం. ఇంతకంటే ఎక్కువ ఏంగావాలె. అందుకే రైతులు ఎవరికి ఓటేస్తే మేలు జరుగుతుందో ఆలోచించాలి.

– తండ లింగయ్యగౌడ్, రైతు, రామచంద్రాపురం, గరిడేపల్లి మండలం